క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసంలో రాజకీయ జోక్యం వద్దు



బాన్సువాడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో రాజకీయ జోక్యం ఉండొద్దని బీసీ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శి పుట్ట భాస్కర్ అన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్, మండల స్థాయి అధికారులకు అప్పగించాలన్నారు. సాయిలు, శ్రీకాంత్, నందు, సోమేశ్, నిఖిల్, బాలు, కొమ్మ సాయిలు తదితరులున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, మాలపాటి, పర్మళ్ల, మాలోత్ సంగ్యానాయక్ తండా గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. కూలీలు ఎక్కువ మంది పనుల్లో పాల్గొనే విధంగా చూడాలని క్షేత్రసహాయకులకు సూచించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి, మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పైపుల తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేటలో చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన డ్రెయినేజీలోకి స్థానికులు ఏర్పాటు చేసుకున్న పైపులను తొలగించే పనులను మంగళవారం స్థానికులు అడ్డుకున్నారు. ప్రధాన రహదారికి ఒకవైపు ఏర్పాటు చేసిన సర్వీస్‌రోడ్డు పక్కనున్న ఇళ్ల నుంచి వెలువడే మురికి నీరు డ్రెయినేజీ ద్వారా దిగువకు ప్రవహించేందుకు సర్వీస్ రోడ్డు కింద నుంచి పైపులను ఏర్పాటు చేశారు. దీనిని గుర్తించిన హైవే సిబ్బంది ప్రొక్లెయిన్‌తో పైపులను తొలగించేందుకు యత్నించారు. దీంతో స్థానికులు వీరిని అడ్డుకున్నారు. హైవే సిబ్బంది వెనక్కు తగ్గి ప్రస్తుతం వేసిన పైపులను తొలగించి మంచి నాణ్యత ఉన్న పైపులను తాత్కాలికంగా వేసుకోవాలని సూచించారు.

వర్సిటీ పేరును మార్చొద్దు



భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ పేరును మార్చొద్దని జేఏసీ పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సత్యం అన్నారు. మంగళవారం సౌత్‌క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ యునివర్సిటీ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు యోగేష్,మహేష్, శ్రీనివాస్, భార్గవి, మానస, ప్రియాంక గౌతమి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పనులకు ప్రాధాన్యత

దోమకొండ: మండలంలో స్వయం ఉపాధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సంఘమేశ్వర్, సీతారంపల్లి గ్రామాలను మండల ప్రత్యేక అధికారి జ్యోతితో కలిసి సందర్శించి మాట్లాడారు. ముత్యంపేటలో ఉపాధి హామీ పథకం నిధులతో బర్రెల షెడ్ నిర్మాణం, పౌల్ట్రీ కోళ్ల ఫారం నిర్మాణ పనులకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి మొక్కలను ఎండ తాకిడి నుంచి సంరక్షించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు జారీ చేశారు.

డిస్ట్రిబ్యూటరీలు మూస్తే ఊరుకోం

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడ్మి, కొత్తాబాది, తాడ్కోల్ , తిర్మలాపూర్, బోర్లం తదితర గ్రామ శివారుల్లోని పంటలకు సరిపడ నీళ్లు ఇవ్వకుండా డిస్ట్రిబ్యూటరీలను మూసివేస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన బుడ్మి గ్రామంలో ఎండిపోతున్న వరిపంటలను పరిశీలించి నీటిపారుదలశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారులు స్పందించి 8వ డీసీ ద్వారా నీటిని వదిలారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్, అంబర్‌సింగ్, జనార్ధన్‌రెడ్డి, షావలీ, సాయిలు, ఆనంద్ రైతులు ఉన్నారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు

- అమర్లబండలో ప్రారంభం కాని హైలెవల్ వంతెన నిర్మాణ పనులు
- తాత్కాలికంగా మొరం పోసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- త్వరగా పనులు పూర్తి చేయాలని వినతి



తాత్కాలికంగా వాగుపై పోసిన మొరం



శిలాఫలకానికే పరిమితమైన వంతెన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అమర్లబండ గ్రామ శివారులో హైలెవల్ వంతెన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి 44 నుంచి అమర్లబండ వయా ధర్మారావు పేట రోడ్డుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి 2023లో అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ శంకుస్థాపన చేశారు. ఈవంతెన నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరు చేయించారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. శంకుస్థాపన చేసినప్పుడు వంతెన పూర్తయి తమ ఏళ్లకల నెరవేరుతుందానుకున్న గ్రామస్తుల ఆశలు అడియాశలయ్యాయి. కాగా, నాలుగు నెలల క్రితం రూ. లక్ష యాభై వేల నిధులతో వంతెనపై మొరం పనులు చేసి వదిలేశారు. వర్షాకాలంలో వాగు పారితే టేక్రియాల్ నుంచి కామారెడ్డికి చేరుకోవడానికి ఐదు కిలోమీటర్ల దూరభారం పెరుగుతోంది. వంతెన నిర్మాణం పూర్తయితే కస్‌కల్ మీదుగా తాడ్వాయి మండల కేంద్రానికి చేరుకోవచ్చు. దీంతో దూర భారం తగ్గుంతుంది. వర్షాకాలం రాకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం..

వర్షాకాలంలో అమర్లబండవాగు పారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత వర్షాకాలంలో వాగుదాటలేని పరిస్థితిలో ఓ నిండు గర్భిణిని ట్రాక్టర్‌పై ఎక్కించి వాగు దాటించి ఆస్పత్రికి తరలించిన సందర్భాలు ఉన్నాయి. వాగు అవతలివైపు ఉన్న రైతులు సైతం ఇలా ట్రాక్టర్‌పై నిలబడి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగును దాటిన ఘటనలు ఉన్నాయి. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రత్యేక దృష్టి సారించి వంతెన నిర్మిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తోందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తవుతుందని అనుకున్నాం



వాగు దగ్గర పనుల నిర్మాణం కోసం శిలాఫలకం ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వంతెన కోసం శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచి పోయాయి. వంతెన పూర్తి అవుతుందని అనుకున్నాం.
–బాల్‌రాజు, అమర్లబండ గ్రామస్తుడు

వంతెనను తొందరగా నిర్మించాలి..



నేను పాల వ్యాపారం చేస్తా. వర్షాకాలంలో వాగు పారుతుండడంతో టేక్రియాల్ మీదుగా తిరిగి కామారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వంతెన కడితే ఇబ్బందులు తప్పుతాయి. తాతల కాలం నుంచి బ్రిడ్జి నిర్మాణం కావడం లేదు. వంతెనను నిర్మించి ఏళ్లనాటి కలను ప్రభుత్వం నెరవేర్చాలి. –శేర్ల రాజు, గ్రామస్తుడు

ముందుకు రావడం లేదు

అమర్లబండ హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపట్టడానికి టెండర్ వేస్తున్నాం. కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.
– సురేశ్ పీఆర్ ఏఈ, సదాశివనగర్

పోచారంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ పీవోలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ చదువుతున్న 127మంది విద్యార్థులు మంగళవారం మండలంలోని పోచారంలో ఎన్‌ఎస్‌ఎస్(జాతీయ సేవా పథకం)కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిరోజు విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలను నాటారు. గ్రామంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా రోడ్లను శుభ్రం చేశారు. మురికికాలువ వెంట పెరిగిన వయ్యారిభామ మొక్కలను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు(పీవో) డాక్టర్ శ్రీలత, డాక్టర్ మీనా మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా తమ విద్యార్థులు వారం రోజులపాటు గ్రామంలో వివిధ కార్యక్రమాలను చేపడతారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరచారి, ఏవో సాయికిరణ్, జీపీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి చైతన్య. మాజీసర్పంచ్ విజితరెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం ఉదయ్‌కిరణ్, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌రెడ్డి, శాస్త్రవేత్త రేవంత్, కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఇంటింటా సర్వే



బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఇంటింటా స్వచ్ఛ సర్వేక్షణ్–24 సర్వే నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలకు ఇచ్చే ర్యాంకింగ్ కోసం ఇంటింటా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో తడి–పొడి చెత్తల సేకరణపై సర్వే నిర్వహించారు. ప్రతి వార్డులో కొన్ని ఇళ్లను సర్వే చేసి ప్రజలు తడి చెత్త–పొడి చెత్త విడివిడిగా ఇస్తున్నారనే అంశాలపై సర్వే నిర్వహించారు. వార్డులో వచ్చే పాయింట్ల ఆధారంగా మున్సిపాలిటీకి ర్యాంకింగ్ ఇవ్వనున్నారు. గత ఏడాది బాన్సువాడ మున్సిపాలిటీకి అవార్డు వచ్చిన విషయం తెలిసిందే.

సారస్వత పరిషత్తు పురస్కారం అందుకున్న శంకర్

కామారెడ్డి అర్బన్: కవి,రచయిత, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వి.శంకర్ తెలంగాణ సారస్వత పరిషత్తు బూర్గుల రంగనాథరావు పురస్కారాన్ని రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ అబిడ్స్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. శంకర్‌ను పలువురు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటాలు ఫలించాయి

కామారెడ్డి అర్బన్: ఎస్సీ వర్గీకరణ పోరాటాలు ఫలించాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.బాగయ్య, కార్యదర్శి బి.వెంకటరాములు అన్నారు. ఎస్సీవర్గీకరణ అమలు తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఈనెల 11 నుంచి చేస్తున్న నిరసన దీక్షలను 18న సాయంత్రం విరమించారు.

రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి



మల్లూర్‌లో పనులు ప్రారంభిస్తున్న నాయకులు



లింగంపేటలో..

నిజాంసాగర్/లింగంపేట/నాగిరెడ్డిపేట/తాడ్వాయి/పెద్దకొడప్‌గల్ : సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు.మంగళవారం మండలంలోని మల్లూర్ గ్రామంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. లింగంపేటలోని మత్తడికింది పల్లెలో మంగళవారం రూ. 55 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు.నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లిలో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి ప్రారంభించారు.తాడ్వాయిలోని బీసీకాలనీలో సీసీ రోడ్లు వేయడానికి రూ.20లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. పెద్దకొడప్‌గల్ మండలం కాటేపల్లి తండా, వడ్లం గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు. అలాగే నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, మాల్తుమ్మెద, గోపాల్‌పేట గ్రామాల్లో ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వేసిన సీసీ రోడ్లను మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ గిరి, ఎంపీడీవో ప్రభాకరచారితో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్లకు క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయించాలని ఆయన సూచించారు.

పోస్టాఫీస్ భవనం కోసం వినతి



కేంద్ర మంత్రి సింధియాకు వినతిపత్రం అందిస్తున్న అజయ్

మద్నూర్(జుక్కల్): నియోజకవర్గంలోని జుక్కల్, బిచ్కుందలో పోస్టాఫీస్ భవనాలను మంజూరు చేయాలని మద్నూర్‌కు చెందిన బీజేపీ సోషల్ మీడియా పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ తమ్మెవార్ అజయ్‌కుమార్ మంగళవారం డిల్లీలో కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు వినతిపత్రం అందించారు. డిల్లీలో కేంద్రమంత్రి నివాసంలో ఆయనను కలిసి సమస్యలను వివరించి సంబంధింత పత్రాలను అందించారు. అలాగే మద్నూర్‌లోని పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పర్మళ్లలో పైపులైనుకు మరమ్మతులు చేయించిన ఎంపీవో మల్హారి



తలమడ్లలో ..

సాక్షి స్పందన

లింగంపేట(ఎల్లారెడ్డి): తాగునీటి సమస్యపై 'తీరని తాగునీటి గోస' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంగళవారం అధికారులు స్పందించారు. మండలంలోని పర్మళ్ల గ్రామంలో ఎంపీవో మల్హారి పర్యటించి ఎస్సీ, బీసీ కాలనీలకు సరఫరా చేసే బోరుమోటర్, పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ఆయా కాలనీల్లో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని వీధుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

దోమకొండ, రాజంపేట మండలాల్లో..

దోమకొండ : మండలంలోని ముత్యంపేట గ్రామంలో మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య వాటర్‌ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేయించారు. తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో, భిక్కనూరు, బీబీపేట మండల కేంద్రాల్లో సైతం పైపులైన్ మరమ్మతు పనులను అధికారులు చేయించారు. తలమడ్లతో పాటు ఆరేపల్లి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పైపులైన్ మరమ్మతులు, ఇతర తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి



ఎల్లారెడ్డిలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న మండలప్రత్యేక అధికారిణి అరుణ

ఎల్లారెడ్డి : మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాలనీ వాసుల వినతి మేరకు బోరు మోటార్లకు మరమ్మతులు చేయించామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు లింబేష్, మహేష్ తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : గిరిజనతండాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటిసమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహమ్మద్ నగర్ మండల ప్రత్యేక అధికారిణి అరుణ అన్నారు. మంగళవారం మహ మ్మద్ న గర్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో అనిత, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. ఆయన మంగళవారం ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీతో కలసి తాడ్వాయి మండలంలోని చిట్యాల, సంతాయిపేట్ గ్రామాలలో పర్యటించారు. గ్రామ కార్యదర్శులు, కారోబారులు, జీపీ సిబ్బంది గ్రామాలలో తిరుగుతూ తాగునీటి సమస్యలను గుర్తించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల రికార్డులను తనిఖీ చేశారు. ఇంటి పన్నులను 100శాతం వసూలు చేయాలని సూచించారు. అలాగే గ్రామ శివారులో ఉన్న నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు పరమేశ్వరి, రాజేశ్వర్ రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

ఘనంగా సుదర్శన హోమం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో సుదర్శన హోమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మినర్సింహస్వామి స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా అర్చకులు నర్సింహచార్యులు, శ్రీనివాస్‌చార్యులు, పరంధామచార్యులు, సంజీవచార్యులు ఈ హోమంను జరిపించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్‌రావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని పలు హనుమాన్ దేవాలయాల్లో మంగళవారం భక్తులు హనుమాన్ విగ్రహాలకు సింధూర పూజలు చేశారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, హిందూ వాహిని ప్రతినిధులు, యెల్లంకి సుదర్శన్, అర్వపల్లి రమేష్, కైలాస్ సంతోష్, మనోహర్, కుంబాల రవి, పాగాకు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో విద్యార్థుల పూజలు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి మాత ఆలయంలో మంగళవారం ఆయా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పట్టణంలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు సరస్వతి మాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమానికి బియ్యం, నగదు విరాళం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని శబరిమాత ఆశ్రమానికి జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త చాట్ల శ్రీశైలం 21క్వింటాళ్ల బియ్యం, రూ.15వేల నగదును విరాళంగా అందజేశారు. ఆశ్రమంలో ఏప్రిల్‌లో జరిగే శ్రీరామ నవమి సందర్భంగా విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాఘవ రెడ్డి, బాలకిషన్‌రావు, నర్సిములు, పండరి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

కామారెడ్డి అర్బన్: సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలోని సంకష్టహర గణపతి దేవాలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదం అందజేశారు. వేదపండితులు జి.ఆంజనేయవర్మ, అర్చకులు సంపత్‌కుమార్ శర్మ, సతీష్‌పాండే, ఆలయ కమిటీ ప్రతినిధులు సుతారి అంజయ్య, రవీందర్‌గౌడ్, విశ్వంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కళ్యాణం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి కొనసాగింపు



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా శనిగరం కమలాకర్‌రెడ్డిని కొనసాగిస్తూ దేవాదాయశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఈ ఉత్తర్వులను కమలాకర్‌రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి మరింత కృషిచేయాలని భక్తులకు మెరుగైన సౌకర్యలు అందించాలని షబ్బీర్‌అలీ సూచించారు.

సంక్షిప్తం

మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలి

నిజాంసాగర్(జుక్కల్): వన నర్సరీల్లో మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని ఈజీఎస్ అధికారులను మహమ్మద్ నగర్ మండల ప్రత్యేక అధికారిణి అరుణ సూచించారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండలం లోని గున్కుల్‌లో ఈజీఎస్ వన నర్సరీని ఆమె పరిశీలించారు.

రూ. 18.70లక్షలు పలికిన బిచ్కుంద తైబజార్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో మంగళవారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను నిర్వహించిన వేలం పాటలో ఖాజామియా రూ.18.70 లక్షలకు దక్కించుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలింకో ఉపకరణాల పంపిణీ సంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన జీవన ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎస్.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు గుర్తింపు కార్డుతో హాజరై కావాల్సిన దివ్యాంగ ఉపకరణాలను తీసుకోవాలని తెలిపారు.

శుక్రవారం రాజంపేట తైబజార్ వేలం పాట

కామారెడ్డి క్రైం : రాజంపేట మండల కేంద్రంలో డీఎల్‌పీవో ఆదేశాల మేరకు శుక్రవారం 2025–26 సంవత్సరానికిగాను తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి రఘురాం ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఈ వేలం పాట నిర్వహించనున్నారు.

25న మామిడిచెట్ల కాత ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలో 52 మామిడిచెట్ల కాతకు ఈ నెల 25న వేలం పాట నిర్వహించనున్నట్లు క్షేత్రం ఏడీఏ ఇంద్రసేన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నామని ఆసక్తి గలవారు పాల్గొనాలని తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కుబ్యానాయక్ తండాలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 20 లక్షల మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి తెలిపారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: ఎల్ఆర్ఎస్ కోసం 2020లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పూర్తిఫీజు రాయితీలో 25శాతం రాయితీ ఇస్తున్నామని బాన్సువాడ డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు ఫీజు చెల్లించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దమ్మ ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక

దోమకొండ: మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగారపు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం, కార్యదర్శిగా అబ్రబోయిన రాజేందర్, కోశాధికారిగా గంప సంతోష్ కుమార్, ఉపకార్యదర్శిగా బట్టు రాజు, గౌరవ అధ్యక్షులుగా పున్న లక్ష్మణ్ తదితరులను ఎన్నుకున్నారు. సలహాదారుడిగా కామిండ్ల కృష్ణ ఎన్నికయ్యారు.